క్లుప్తంగా

శ్రీరామభక్తుల పాదయాత్ర



తిరువూరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దర్శనార్థం గంపలగూడెం మండలం సత్యాలపాడు నుంచి భక్తులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం తిరువూరు చేరింది. గత 25 సంవత్సరాలుగా తాము పాదయాత్ర చేసి ముక్కోటికి భద్రాచల సీతారాముల దర్శనం చేసుకుంటున్నామని నిర్వాహకులు హనుమంతరాజు తెలిపారు. 400 మందికి పైగా భక్తులు ఈ పాదయాత్రలో పాల్గొంటామని, ఈ నెల 22కు భద్రాచలం చేరనున్నట్లు తెలిపారు. తిరువూరు 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ ఈ భక్తబృందానికి వేంకటాచలస్వామి దేవస్థాన ఆవరణలో భోజన ఏర్పాట్లు చేశారు.

నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన ఆరోగ్యశ్రీ కార్డులను ఇబ్రహీంపట్నం ఐదో సచివాలయం పరిధిలో ఎంపీపీ పాలడుగు జోత్స్న నాయకులతో కలిసి లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. అర్హత కలిగిన పేదవాడు వైద్యం కోసం అప్పులపాలు కాకూడదని గతంలో రూ.5 లక్షల పరిధి ఉన్న ఆరోగ్యశ్రీ ఖర్చు రూ.25 లక్షలకు పెంచడం అభినందనీయమన్నారు. మన ఆరోగ్య వివరాలు డిజిటల్‌గా క్యూఆర్ కోడ్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ పర్వీన్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, కొండపల్లి వైఎస్సార్ సీపీ కన్వీనర్ మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్లు నల్లమోతు లక్ష్మీ, అడపా వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ నగర అంతర పాఠశాలల అథ్లెటిక్స్ పోటీల్లో గుంటుపల్లి సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జేస్ ఆంటోనీ మంగళవారం తెలిపారు. విజయవాడ నలంద పాఠశాలలో జరిగిన పోటీల్లో 100 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, 100+ నాలుగు మీటర్ల రిలే పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ జేస్ ఆంటోనీ, వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లారావు అభినందించారు.

గ్యాస్ కనెక్షన్లు తప్పక ఈకేవైసీ చేయించాలి



గంపలగూడెం: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వంట గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఈకేవైసీ చేయించాలని గంపలగూడెం దుర్గ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సుబ్బారావు , నరసింహారావు తెలిపారు. తమ ఏజెన్సీ పరిధిలో మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 19,500 గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిలో ఇప్పటికే రెండు వేల మంది ఈకేవైసీ చేయించినట్లు తెలిపారు. మిగిలిన వారు గ్యాస్ కంపెనీ వద్దకు వచ్చి ఈకేవైసీ చేయించాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 15వ తేదీలోపు ప్రతి ఒక్కరూ కచ్చితంగా ప్రభుత్వం ఆదేశానుసారం ఈకేవైసీ చేయించాల్సి ఉందని తెలిపారు.

డ్రైవర్లకు జీతాలు పెంచాలి



జి.కొండూరు: ఆయిల్, గ్యాస్‌ను రవాణా చేసే వాహనాల డ్రైవర్లకు కనీస వేతనాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి మహేష్ అన్నారు. మండల పరిధి కట్టుబడిపాలెం హెచ్‌పీసీఎల్ కంపెనీలో డ్రైవర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం యూనియన్ అధ్యక్షుడు ఎస్. సుందరరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ నాయకులు డ్రైవర్ల సమస్యలపై చర్చించారు.

ఆస్పత్రి భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో భవనాల నిర్మాణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఏరియా ఆస్పత్రి ఆవరణలో రూ.21.15 కోట్లతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు కోరారు. భవన నిర్మాణ పనులను పరిశీలించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి, ఈఈ లింగయనాయుడు, నాగార్జునరావు మంగళవారం రాగా వారితో పలు అంశాలపై ఎమ్మెల్యే ప్రతాప్ చర్చించారు. భవనం అందుబాటులోకి వచ్చినట్లయితే ఏరియా ఆస్పత్రి స్థాయిని వంద పడకల నుంచి మూడు వందల పడకలకు పెంచేందుకు మార్గం సుగమవుతుందన్నారు. నూతన భవనంలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ల ఏర్పాటు, నూతన బెడ్‌ల కొనుగోలు, ఏర్పాటు చేయాల్సిన వైద్య సామగ్రి, ల్యాబ్‌ల ఏర్పాటు తదితర విషయాలపై ఇంజినీరింగ్ అధికారులతో పాటు వైద్యులతో ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడారు. సకల సదుపాయాలతో నూతన భవనాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు అనేక విప్లవాత్మకమైన చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్యులను నియమించడంతో పాటు భవనాల కొరత ఉన్నచోట నూతన భవనాలను నిర్మిస్తుందన్నారు. పట్టణంలో ఇప్పటికే రెండు పట్టణ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్మాణానికి రూ.1.60 కోట్లను మంజూరు చేయగా, ఒక కేంద్ర భవన నిర్మాణం పూర్తయి ఆస్పత్రిని ప్రారంభించుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రతి మండలానికి 104 వాహనాలను ఏర్పాటు చేసి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తెచ్చిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలందరూ గమనించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్, సీనియర్ వైద్యులు డాక్టర్ ఆర్ నరేంద్రసింగ్, డీఈ సత్యనారాయణ, ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం

ఎమ్మెల్యే రక్షణనిధి



కంభంపాడులో ఆరోగ్య శ్రీకార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: పేదలందరికీ మెరుగైన కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడు సచివాలయంలో మంగళవారం ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రతి ఒక్కరికీ మరింత చేరువ చేసేందుకు ఉచిత వైద్యం పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కొత్త ఫ్యూచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్డు ద్వారా ప్రతి కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచిత వైద్యం చేయించుకునే విధంగా వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదవారికి ఖరీదైన వైద్యం అందిస్తున్నామన్నారు. వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదని ఆరోగ్యశ్రీ కార్డులు ప్రవేశపెట్టి, వాటి ద్వారా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలపై సర్వేలు నిర్వహించి, వారికి ఏ రకమైన వైద్యం అవసరమో తెలుసుకుని మెరుగైన వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా కృష్ణా జలాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా జలాల శాశ్వత పరిష్కారం కోసం రూ.49 కోట్లు కేటాయించి టెండర్లు కూడా పిలచామని, త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పుల్లారావు, జెడ్పీటీసీ భూక్యా గనియా, ఎంపీపీ నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎస్ నాగనర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ శివారెడ్డి, వైద్యాధికారి స్వాతి, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు టి. సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మేడూరులో నేటి నుంచి సప్తాహ వేడుకలు



మేడూరు వీరాంజనేయస్వామి ఆలయం



వీరాంజనేయస్వామి

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం నుంచి 46వ వార్షిక సప్తాహ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ జే వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 6.30 గంటలకు విఘ్నేశ్వర పూజతో ఆలయం ప్రధాన అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు, అర్చక బృందంచే ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభిస్తారు. 22న అష్టోత్తర శత కలశాభిషేకం, 23న ముక్కోటి ఏకాదశి, గీతా జయంతి ప్రత్యేక పూజలు జరుగుతాయి. 24న సామూహిక హనుమాన్ వ్రతం నిర్వహిస్తారు. 25న వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకులతో విశేష పూజలు జరుగును. 26న దత్త జయంతి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 27న హనుమత్ స్వాములకు ఇరుముడి, పూర్ణాహుతి, శాంతి కల్యాణం జరుగును.

ఈవీఎం మిషన్ల వినియోగంపై అవగాహన

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్తూరు తాడేపల్లి పంచాయతీ వద్ద ఈవీఎం మిషన్ల ద్వారా ఓటు వినియోగించుకునేందుకు మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పొందిన గొల్లపూడి వీఆర్వో భాను ఈవీఎం మిషన్‌ను ఎలా వినియోగించుకోవాలో ప్రజలకు వివరించారు. డమ్మీ ఈవీఎం మిషన్ ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎల్.పుండరీకవరద వర్మ, గ్రామ సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, టీడీపీ ప్రతినిధులు బొర్రా పున్నారావు, నాగరాజు, సీపీఐ ప్రతినిధి నరసింహారావు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

నెమలి/ఉమ్మడదేవరపల్లి(గంపలగూడెం): త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం మండలంలో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. నెమలి, ఉమ్మడదేవరపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఈవీఎంలు పనిచేసే విధానాన్ని ఓటర్లకు వివరించారు. ఎంఈఓ నరసింహారావు పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యంతో చదివితే విజయం తథ్యం

శాసనమండలి సభ్యుడు లక్ష్మణరావు

తిరువూరు: ఏపీపీఎస్సీ గ్రూప్–1, 2 పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్దిష్ట లక్ష్యంతో చదివితే విజయం తథ్యమని కృష్ణా, గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. తిరువూరులో ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీపరీక్షలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సిలబస్, పరీక్షా విధానం అవగాహన చేసుకుని పరీక్షలకు సిద్ధమవ్వాలన్నారు. పోటీ తీవ్రంగా ఉన్నందున ప్రతి నిముషం విలువైనదిగా భావించి చదవాలని లక్ష్మణరావు సూచించారు. ఏపీపీఎస్సీ సూచించిన పాఠ్యపుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలను చదివితే పరీక్షలో సమాధానలు గుర్తించడం సులభతరమవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పలు పోటీపరీక్షల్లో తరచు వచ్చే ప్రశ్నలు, వాటికి సమాధానం ఎంచుకునే విధానాన్ని వివరించారు. తిరువూరు ఆర్డీఓ మాధవి పోటీపరీక్షల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. సమయపాలన, నిరంతర శ్రమ, లక్ష్య సాధన, ఏకాగ్రత ఉంటేనే ఏ పరీక్షలోనైనా విజయం సాధించవచ్చన్నారు. యూటీఎఫ్ రూపొందించిన పోటీపరీక్షల మెటీరియల్‌ను లక్ష్మణరావు, మాధవి ఆవిష్కరించారు. తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు, విన్నర్స్ అకాడమీ డైరెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

పంట నష్టంపై ముసాయిదా జాబితా విడుదల



నష్టపోయిన వరి పైరు వివరాలను కొణిజెర్ల సచివాలయంలో విడుదల చేసిన సిబ్బంది

గంపలగూడెం: ఇటీవల సంభవించిన తుపాను కారణంగా గంపలగూడెం మండలంలో నష్టపోయిన వరి పైరుకు సంబంధించిన వివరాలను సేకరించి జాబితాలను ఉన్నతాధికారులకు పంపినట్లు మండల వ్యవసాయాధికారి బి.సాయిశ్రీ మంగళవారం తెలిపారు. అధిక వర్షాలకు మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 2,384 మంది రైతులకు చెందిన 1,593హెక్టార్ల విస్తీర్ణంలో వరిపంట నష్టం వాటిల్లిందన్నారు. సంబంధిత జాబితాలను సచివాలయాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలో తుపానుతో పంటలు నష్టపోయిన రైతుల వివరాల ముసాయిదా జాబితా పరిశీలనకు ఆయా ఆర్బీకేల వద్ద 22వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిమిత్తం ఉంచినట్లు ఏఓ రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద పంట నష్టపోయిన రైతుల వివరాలను మంగళవారం పరిశీలనకు ఉంచారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని త్రిష ప్రతిభ



క్రికెట్ క్రీడాకారిణి త్రిష పూజిత

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థిని తన ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ క్రికెట్ మహిళా ఐపీఎల్‌లో స్థానం సంపాదించుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం కళాశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ క్రికెట్ క్రీడాకారిణి త్రిష పూజిత అంతర్జాతీయ క్రికెట్ మహిళా ఐపీఎల్ క్రికెట్ వేలం పాటలో గుజరాత్ జైంట్స్ కనీస ధర రూ.10 లక్షలకు దక్కించుకుందని పేర్కొన్నారు. త్రిష పూజితకు క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని తమనించి తండ్రి కృష్ణారావు తనకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చి హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఎంతో వ్యయప్రయాసలకోర్చి క్రికెట్‌లో ఉన్నత స్థానానికి బాట వేశారని తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ఏ.కొండూరు: మండలంలోని రామచంద్రాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హోప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ తయారు చేసిన ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హోప్ సంస్థ ఫౌండర్ బి. విశ్వభారతి మాట్లాడుతూ ఉచిత స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరుశాతం మార్కులు సాధించాలన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి



వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నరసింహారావు

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, అందుకే పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు అన్నారు. నుగొండపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సచివాలయం వద్ద అభివృద్ధి పథకాల బోర్డును జెడ్పీటీసీ వీరబాబు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలబడి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, సర్పంచ్ కందుల మల్లేశ్వరి, ఈఓపీఆర్డీ శేఖర్, పినమరెడ్డిపల్లి సర్పంచ్ జోల భూషణం, సచివాలయల కన్వీనర్ నందూరు భాస్కర్ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల విక్రమ్, కాంచనరావు, పంచాయతీ కార్యదర్శి పుల్లారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, తివేణీదుర్గ

నూజివీడు: ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేలను ఇంటింటికీ పంపి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే ఆ పని చేస్తోందన్నారు. దీనిని బట్టే ప్రజల సమస్యల పట్ల, వారి క్షేమం గురించి సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఎంత చిత్తశుద్ధి ఉందో ప్రజలు గమనించాలన్నారు. అధికారం కోసం ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెప్తున్న టీడీపీ నాయకుల మాటలను ఎవరూ నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్‌చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కార్యదర్శి కోటగిరి పూర్ణిమ, నాయకులు కోటగిరి సతీష్ పాల్గొన్నారు.

యోగా శాస్త్రీయమైన సనాతన సంప్రదాయ కళ



ఇబ్రహీంపట్నం: ప్రాచీన యోగా శాస్త్రీయమైన సనాతన సంప్రదాయ కళ అని యోగా గురువు లంకే జనార్దన్ అన్నారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీటీపీఎస్ కల్యాణ మండపంలో 10 రోజులుగా జరిగిన ఉచిత యోగా శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఎన్టీటీపీఎస్ ఎస్ఈ సురేష్‌బాబు యోగా గురువు లంకే జనార్దన్‌ను సత్కరించారు. ఏడీఈ వై.సురేష్, సుబ్రహ్మణ్యం, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

విస్సన్నపేట: ప్రధానమంత్రి ఉపాధి కల్పన, జగనన్న బడుగు వికాసంలో సబ్సిడీపై రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పరిశ్రమలశాఖ డిప్యూటీ డైరెక్టర్ సాంబయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం మీటింగ్ హాల్లో ప్రధానమంత్రి ఉపాధి కల్పన, జగనన్న బడుగు వికాసం, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ పథకాలలో రుణాలు పొందడంపై గురించి అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు రాజేష్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సురేష్, బ్యాంక్ మేనేజర్ సూర్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల పేదలకు అందాలి

గణపవరం(మైలవరం): కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామాల్లోని పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నూతులపాటి బాల కోటేశ్వరరావు పేర్కొన్నారు. మైలవరం మండలం గణపవరంలో మంగళవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ కార్డ్, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, ప్రధానమంత్రి జల్ జవాన్ యోజన తదితర పథకాలు సమాజంలో అందరికి అందాలన్నారు.

శివాలయం ముఖ ద్వారం ప్రారంభం

గోసవీడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం గోసవీడు విశ్వేశ్వర స్వామి ఆలయానికి రూ. 4లక్షల దాతల వితరణతో నిర్మించిన ముఖ ద్వారం, ప్రహరీ గోడలను మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన కాజా ప్రమీలరాణీ జ్ఞాపకార్థం వారి పెద్ద కుమారుడు, కోడలు కాజా రాజేష్, ఇంద్రాణీ సంబంధిత మొత్తాన్ని విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్బీఆర్‌సీఈ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



అధ్యాపకుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడు సీ రాజమల్లుకు పీహెచ్‌డీ ప్రదానం జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మంగళవారం తెలిపారు. అధ్యాపకులు రాజమల్లు జేఎన్‌టీయూఏ అనంతపురం, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సర్వీస్ లైఫ్ ప్రెడిక్షన్ ఆఫ్ సెల్ఫ్ కంపాక్టింగ్ రీయిన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ స్ట్రక్చర్స్ విత్ రెస్పెక్ట్ టు క్లోరైడ్ ఐయాన్ పెనెట్రేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పరిశోధన ప్రొఫెసర్ ఈ అరుణకాంతి, జేఎన్‌టీయూఏ అనంతపురం, డాక్టర్ టి. చంద్రశేఖరరెడ్డి జీపీఆర్‌ఈసీ ప్రొఫెసర్, కర్నూల్ పర్యవేక్షణలో జరిగిందని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం, ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, డాక్టర్ జే వెంకటేశ్వరరావు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థికి అభినందనలు

నూజివీడు: చిన్నతనం నుంచే ఆసక్తి ఉన్న రంగంలో రాణించేందుకు కృషి చేసినట్లయితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని విజిడమ్ స్కూల్‌కు చెందిన 9వ తరగతికి చెందిన ఎండీ మాజిన్ అనే విద్యార్థి ఇటీవల అమరావతిలో నిర్వహించిన కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. దీంతో ప్రతిభ చూపిన విద్యార్థిని ఎమ్మెల్యే ప్రతాప్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరాటేలో పూర్తిస్థాయిలో శిక్షణ పొంది ప్రతిభతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభను కనబరచాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుమన్, ప్రిన్సిపాల్ ఎం.రవి, కరాటే కోచ్ అంజిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై మేట్లకు శిక్షణ

ముసునూరు: ఉపాధి హామీ పథకంలో నిర్వహించే ప్రతి పనులకు కొలతలు తీయడం, మార్కింగ్ చేయడంపై సిబ్బందికి అవగాహన అవసరమని ఏపీఓ టి.రోజలీల అన్నారు. ముసునూరులోని ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం మహిళా మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసీ జయప్రసాద్, టీఏలు రవికుమార్, రామిరెడ్డి, అర్జున్, ముసునూరు, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, లోపూడి, గుళ్లపూడి, రమణక్కపేట, సూరేపల్లి, చింతలవల్లి మేట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్ ధ్వంసం

నూజివీడు: పట్టణంలోని విస్సన్నపేట రోడ్డులో పెట్రోలు బంకు సమీపంలో ఉన్న అక్రమ లే అవుట్‌ను సీఆర్‌డీఏ అధికారులు మంగళవారం ధ్వంసం చేయించారు. సర్వే నంబరు 356/2, 3లలో ఎలాంటి అనుమతి తీసుకోకుండా వ్యవసాయ భూమిలో వేసిన లేఅవుట్‌లోని రోడ్లను ధ్వంసం చేయడంతో పాటు సర్వే రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ మాట్లాడుతూ అనధికార లేఅవుట్‌లను వేసి ప్లాట్లను విక్రయించడం చట్టరీత్యా నేరమని, శిక్షార్హులని హెచ్చరించారు. సీఆర్‌డీఏ పరిధిలో ఎవరైనా అనధికార కట్టడాలు నిర్మించినా, లేఅవుట్‌లు వేసిన ఫోన్ నంబరు 0866–2527154కు గాని, వాట్సాప్ 70955 99838కు గాని ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

ఆగిరిపల్లి: హైదరాబాద్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న చీటీ నాగేంద్రరావు భౌతికకాయానికి మంగళవారం నరసింగపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన సోమవారం హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. నాగేంద్రరావు స్వగ్రామం నరసింగపాలెం. ఏలూరు ఎస్పీ ఆదేశాలతో ఆగిరిపల్లి ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో నాగేంద్రరావు భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో గౌరవ వందనాలు సమర్పించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

చాట్రాయి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం డీవైఈవో సేవ్యా నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి గ్రేడ్‌లు సాధించాలన్నారు. చదువుల్లో పోటీతత్వం ఏర్పరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి కృష్ణ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాధికారిగా ప్రసన్న

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య అధికారిగా డాక్టర్ బి.ప్రసన్న నియమితులయ్యారు. గోపవరం ఆయుర్వేద వైద్యశాలలో పనిచేస్తున్న ఆమెను కమిషనర్ ఆదేశాల ప్రకారం ఆగిరిపల్లి ఆయుర్వేద వైద్యశాలకు బదిలీ చేశారు. మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

డాక్యుమెంట్ పోయినది

అర్థ తిరుపతిరావు S/o. నరసింహారావు, డి.నెం. 1-20, పినపాక గ్రామము, జి.కొండూరు (మం), N.T.R. జిల్లా అను నాకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ (నెం. 1815/1993) బండిమీద జి.కొండూరు వెళ్ళుచుండగా పోయినది. ఎవరికైనా దొరికినచో పై అడ్రస్సుకు (లేదా) ఈ క్రింది ఫోన్‌కు తెలుపగలరు. ✆ 99127 38828